ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా..

సిద్దిపేట : ఉత్తమ మార్కులు సాధించిన మైనార్టీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

- ఇంటర్ మొదటి, ద్వితీయ రెండింటిలోనూ బాలికలదే పై చేయి..
- మొదటి సంత్సరంలో 48.77 శాతం ఉత్తీర్ణత..
- ద్వితీయ సంవత్సరంలో 61.08 శాతం ఉత్తీర్ణత..
- ఫస్టియర్‌లో బాలురు 36.33, బాలికలు 58.21 శాతం ఉత్తీర్ణత..
- సెకండియర్‌లో బాలురు 49.81, బాలికలు 69.61 శాతం ఉత్తీర్ణత..
- రాష్ట్రంలో ఫస్టియర్ ఫలితాల్లో జిల్లాకు 29వ స్థానం..
- రాష్ట్రంలో సెకండియర్‌లో జిల్లాకు 28వ స్థానం..
- ఒకేషనల్ ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత శాతం..
- ఫస్టియర్ 42.4, సెకండియర్‌లో 54 శాతం ఉత్తీర్ణత..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. అయితే ఈ సారి కూడా సిద్దిపేట జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంలోనూ బాలికలే పైచేయి సాధించారు. గత ఫిబ్రవరి 29న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మార్చి 19వ తేదీన ముగిశాయి. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 48.77 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 61.08 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అయితే రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ఫస్టియర్ ఫలితాల్లో 29వ స్థానంలో ఉండగా.. సెకండియర్ ఫలితాల్లో 28వ స్థానంలో నిలించింది. ఇంటర్ పరీక్షలకు సంబంధించిన రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు నేటి నుంచే అప్లై చేసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

సత్తా చాటిన బాలికలు

బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లాలో బాలికలు సత్తా చాటారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్‌లో 7,541 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 3,678 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 48.77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 3,251 మంది బాలురకు 1,181 మంది ఉత్తీర్ణత సాధించగా 36.33 ఉత్తీర్ణత శాతం, బాలికలు 4,290 మంది పరీక్ష రాయగా..58.21 శాతంతో 2,497 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ సెకండియర్‌లో మొత్తం జిల్లా వ్యాప్తంగా 7,361 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 4,496 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై.. 61.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 3,172 బాలురకు 1,580 మంది ఉత్తీర్ణులు కాగా 49.81 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. 4,189 మంది బాలికలకు గానూ 69.61 శాతంతో 2,916 మంది ఉత్తీర్ణులయ్యారు. కావున ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ రెండింటిలోనూ బాలికలే పై చేయిగా నిలిచారు.

ఒకేషనల్ ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత శాతం..

సిద్దిపేట జిల్లా ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైంది. ఒకేషనల్ ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 2,677 మంది విద్యార్థుకు గానూ 1,135 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులై.. 42.4 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 1,563 మంది బాలురకు 27.38 శాతంతో 428 మంది ఉత్తీర్ణులయ్యారు. 1,114 మంది బాలికలకు 63.46 శాతంతో 707 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ విభాగంలో 2,461 మంది విద్యార్థులకు గానూ 1,329 మంది ఉత్తీర్ణులై.. 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 1,283 మంది 37.26 శాతంతో 478 మంది పాసయ్యారు. 1,178 మంది బాలికలకు 72.24 శాతంతో 851 మంది ఉత్తీర్ణులయ్యారు. అయితే ఒకేషనల్ ఫలితాల్లోనూ బాలుర కంటే బాలికలదే హవా కొనసాగింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా 33వ స్థానంలో ఉండగా.. సెకండియర్ ఒకేషనల్ ఫలితాల్లో 32వ స్థానంలో ఉంది.

మే 24 నుంచి సప్లమెంటరీ..

విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. నేటి నుంచే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు కూడా అవకాశం కల్పిస్తామని, మే 2 వరకు గడువు విధించినట్లు అధికారులు తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

లద్నూర్‌లో బొడ్రాయికి పూజలు చేస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 24 : మద్దూరు మండలంలోని లద్నూర్ లో బుధవారం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు కొడకండ్ల రాధాకృష్ణశర్మ, దూసకంటి రాజేశ్ శర్మ వైదిక నిర్వహణలో గణపతి పూజ, జలాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠాపన విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పుట్ట వెంకట్రమణారెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, జీడికంటి సురేశ్, దుర్గమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కనకాచారి, నాయకులు దాసరి పద్మారెడ్డి, దండు సోమన్న, కాసర్ల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

భైరాన్‌పల్లిలో దుర్గమ్మవిగ్రహ ప్రతిష్ఠాపన

ధూళిమిట్ట మండలంలోని భైరాన్‌పల్లిలో దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పార్నంది అంజనేయశర్మ, తిగుళ్ల రామ్మూర్తి శర్మ, రవీందర్‌శర్మ, దూసకంటి ప్రశాంత్‌శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని చిన్న ఆరెపల్లి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు రాజిరెడ్డి, వెంకటేశ్వరశర్మ ఉన్నారు.

మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంకల పర్వాతాలుయాదవ్ సోదరి వివాహానికి హాజరైన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన జంకల పర్వాతాలు యాదవ్ సోదరి భాగ్యలక్ష్మి వివాహం బుధవారం దుద్దెడలో జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వాదించి, శుభాకాంక్షలు తెలిపారు. చేర్యాల పట్టణంలోని పీఎమ్మార్ గార్డెన్‌లో మిట్టపల్లి దివ్య, సతీశ్‌రెడ్డి వివాహంతో పాటు గుర్జకుంట కమాన్ వద్ద భద్రకాళి ఫంక్షన్‌హాల్ కొమురవెల్లికి చెందిన బత్తిని కనకలక్ష్మి, మల్లేశం దంపతుల కుమార్తె మహేశ్వరి వివాహానికి ఎమ్మెల్యే పల్లా హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

తొగుట, ఏప్రిల్ 24 : అమ్మవారి దయతో సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి వేడుకున్నారు. మండలంలోని గుడికందులలో జరుగుతున్న మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో జరిగిన వెంకట్‌రావుపేటకు చెందిన గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య కుమారుడు గణేశ్ వివాహానికి, నాగులపల్లి యాదగిరి వివాహానికి, వడ్డెర కాలనీకి చెందిన బోదాసు కనకయ్య కుమారుడు మధు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాందెడ్డి, సొసైటీ చైర్మన్ కె. హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ దోమల కొమురయ్య, కందిరాందెడ్డి, నాయకులు బోయిని శ్రీనివాస్, కోల కనకయ్య, సుతారి రాములు, సుతారి రాంబాబు, గంగొళ్ల ఆంజనేయులు ఉన్నారు.

పెద్దమాసాన్‌పల్లిలో జరిగిన వివాహానికి హాజరైన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఆలయాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పూజలు

సిద్దిపేట, ఏప్రిల్ 24 : సిద్దిపేట పట్టణంలోని పలు ఆలయాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమ్స్ కాలనీలోని కార్యసిద్ధి శ్రీ బాలాంజనేయ స్వామి శివ పంచాయతన విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో, భారత్ నగర్‌లోని విశాలాక్షి సమేత విశ్వేశ్వర ఆలయ శిఖర, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని యం త్ర ప్రతిష్ఠ, ధ్వజ స్థాపన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు

సత్యసాయిబాబా సేవలు చిరస్మరణీయం

అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్

హుస్నాబాద్, ఏప్రిల్ 24: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా పేదలకు అనునిత్యం అండగా ఉంటూ ఉచిత విద్య, వైద్యం అందించడమే కాకుండా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ వ్యాప్తంగా భక్తుల గుండెల్లో నిలిచిపోయారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి 13వ నిర్యాణ దినోత్సవం (వర్ధంతి) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజన పాటలతో అలరింపజేశారు. అనంతరం గాంధీచౌక్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనితారెడ్డి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, ప్రతినిధులు సంధ్యావళి, దొడ్డి లక్ష్మీ, కొత్తపల్లి రవీందర్, స్వరూప, జ్యోతి, చంద్రకళ, కాపర్తి జయ, నాగరాణి, మాశెట్టి రాణి, యాదగిరిరెడ్డి, ఉమాదేవి, ఉమారాణి, భవాని, శోభ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు కనీస వేతనాలు చెల్లించాలి

ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీజీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్, ఏప్రిల్ 24 : జాతీయ ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనాలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమదోపిడీకి గురిచేస్తున్నదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ప్రశ్నించారు. బుధవారం గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామలో ఉపాధిహామి కూలీలకు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం ప్రకారం వేసవిలో కూలీలకు చెల్లించాల్సిన సమ్మర్ అలవెన్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి బ్యాగరి వేణు,రైతులు ఉన్నారు.

బాలల వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు

చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను అందిస్తున్న సూపర్‌వైజర్ పుష్పలత

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 24 : బాలల వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. బుధవారం ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, విజయ, ఆయాలు పాల్గొన్నారు.

జేపీ తండాలో విగ్రహా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఆలయంలో పూజలు చేస్తున్న వంగ రాజేశ్వర్‌రెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని జేపీ తండాలో దుర్గా వీరాంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఈ వేడుకల్లో రంగధాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్ భిక్షపతి నాయక్, రాజు, జానీ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగీత శిక్షణాశిబిరం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24 : సిద్దిపేట అన్నమాచార్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వేసవి సంగీత శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు అన్నమయ్య పవన్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఉత్సాహవంతులైన చిన్నారులు, బాల బాలికలు, యువతీ యువకులు,అన్ని వయస్సుల వారు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గనవచ్చున్నారు. శిక్షణ శిబిరంలో ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలు,సాంప్రదాయ భజనలు,సోత్రాలు,శ్లోకాలు శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక అంశాలను నేర్పిస్తామన్నారు. సంగీత శిక్షణ శిబిరం ఈనెల 26 నుంచి మే10 వరకు జరుగుతుందని, సంగీత శిక్షణ సిద్దిపేట వేంకటేశ్వర ఆలయం వెనుక గల వికాస తరంగిణీ భవనంలో నిర్వహిస్తామన్నారు.

బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ

దుబ్బాక టౌన్, ఏప్రిల్ 24 : రైతు సమన్వయ సమితి దుబ్బాక మండల మాజీ అధ్యక్షుడు వంగ బాల్‌రెడ్డిని బీఆర్ఎస్ బహిష్కరించింది. బుధవారం పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణగౌడ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన వంగబాల్‌రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఇర్కోడు విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేటరూరల్ మండలంలోని ఇర్కోడు ఆదర్శ పాఠశాల

సిద్దిపేటరూరల్,ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు ఆదర్శ పాఠశాల,కళాశాల విద్యార్థులు ప్రతిభచూపారు. మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో టి.రమ్య 405 మార్కులు, బి. అక్షయ 403 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో నూర్నీస్సా 460, శశికాంత్ 452, ప్రణతి 451, శ్రీవల్లి 449, సరళ 442 మార్కులు సాధించారు. రెండో సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో వెన్నెల 943 , శ్రావణి 941 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు, అధ్యాపకులు అభినందించారు.

సత్తా చాటిన మైనార్టీ గురుకుల విద్యార్థులు

సిద్దిపేట, ఏప్రిల్ 24 :రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో వై.చందన 453 మార్కులు, హేమలత 446 మార్కులు, శ్రీదేవి 442, అక్సా 432, వర్షినిప్రియ 412, ఆజ్రా 400 మార్కులను సాధించారు. బైపీసీలో శ్రావ్య 440 మార్కులకు 432 మార్కులు, ముష పియాగుల్ 419 మార్కు లు, అంజలి 414 మార్కులు, నిశ్రాత్ 412 మార్కులు, పరమేశ్వరి 412 మార్కులు, ప్రహర్షిత 46 మార్కులు సాధించారు. ఇంట ర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో బైపీసీ విద్యార్థులు ఎం. సుష్మ 969 మార్కు లు, అశ్విని 953 మార్కులు, ఆర్.నిషి త 939 మార్కులు, నదియా 937 మార్కులు, సమ తరుణమ్ 934 మార్కులు, హర్షిత 530 మార్కులు, వర్షిని 929 మార్కులు, అనురాధ 94 మార్కులు సాధించారు. ఎంపీ సీ ద్వితీయ సంవత్సరంలో ఉదయ్ శ్రీ 916 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుప్రియ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మనోజ్ కుమార్ 945/1000, సాయికిరణ్ 890/1000 మార్కులు సాధించారు. కస్తూర్బా జూనియర్ కళాశాలలో నవ్య 460/500 మార్కులు సాధించింది.

ప్రతిభ కనబరిచిన కస్తూర్బా విద్యార్థులు

చేర్యాల, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో చేర్యాల కస్తూర్బావిద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో విద్యార్థిని సాయిదీప్తి 500 మార్కులకు గాను 492 మార్కులతో కస్తూర్బా పాఠశాలలోతో పాటు సిద్దిపేట జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. సీఈసీలో అక్షిత 500 మార్కులకు 420 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. వై.వైశాలి 500 మార్కులకు 476 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో కవిత 926 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి అభినందించారు.

కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో కొండపాక ప్రభుత్వ జూనియర్ కళశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఎర్ర నిఖిత 432, బైపీసీలో సున్నపు అర్చన 415, ఎంఈసీలో సుండు జయశ్రీ 364, సీఈసీలో దొడ్ల అదిత్య 377 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో బుద్ది గీత 974 మార్కులు, ఎం.ప్రకాశ్ 949, నీల ప్రవళిక 930 మార్కులు సాధించారు. అధ్యాపకులు అభినందించారు.

గజ వాహనంపై లక్ష్మీనరసింహుడు



బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని పురవీధుల గుండా గజ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులిచ్చి స్వామివారికి స్వాగతం పలికి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. -బెజ్జంకి, ఏప్రిల్ 24

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, ఏప్రిల్ 24 : రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట నుంచి కుకునూరుపల్లికి బీటీ రోడ్డు వేయడంతో పాటు కొమురవెల్లి మండల కేంద్రం నుంచి రాంసాగర్‌కు వెళ్లే రోడ్డు, ఐనాపూర్ నుంచి తపాస్‌పల్లి వెళ్లే రోడ్డు, ఐనాపూర్ నుంచి కొండపోచమ్మ వెళ్లే రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తాడూరి ర వీందర్, అత్తిని శారద, రవీందర్, సాయిలు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

మద్దూరు (ధూళిమిట్ట), ఏప్రిల్ 24 : నేడు భువనగిరి పట్టణంలో జరిగే కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్, మందయాదగిరి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ భారీ మెజార్టీతో విజయం సాధించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పదేండ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఒరిగింది ఏమిలేదన్నారు.

నేడు సిద్దిపేటకు అమిత్ షా

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 : నేడు సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను బుధవారం మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పరిశీలించారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి సిద్దిపేట పోలీస్ కమీషనర్ బి.అనురాధ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఆర్ అడీషనల్ డీసీపీ రామచంద్రరావు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

వర్గల్, ఏప్రిల్ 24 : మండలంలోని గిర్మాపూర్, మజీద్‌పల్లి గ్రామాలతో పాటు నెంటూర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయాల్లో వార్షికోత్సవ సంబురాలు ఘనంగా ముగిశాయి. గౌడ, ముదిరాజ్‌ల కుల ఇలవేల్పు ఎల్లమ్మదేవి, పెద్దమ్మలకు డప్పుచప్పుళ్లతో, పోతరాజుల నృత్యాలతో బోనాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు దేవతా మూర్తులను దర్శించుకున్నారు.

కొనుగోలులో అక్రమాలను అరికట్టాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడి చేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని భారతీయ కిసాన్ సంఘ్‌జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో గన్నీసంచికి ఐదు వందల గ్రాములు మాత్రమే తూకం వేయాల్సి ఉండగా కిలోకుపైగా తూకం వేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. వీటికితోడు ఆయా కేంద్రాల్లో చలువ పందిల్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా అధికారులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే రైతులను నిలువుదోపిడీ చేసే చర్యలు నిలిపివేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలను కల్పించాలని లేనిపక్షం లో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

వర్గల్ : పట్టుబడిన వాహనంతో ఎస్సై శివకుమార్

వర్గల్, ఏప్రిల్ 24 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున గౌరారం వద్ద ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. గజ్వేల్ పట్టణానికి చెందిన మహ్మద్‌నబీ బోలోరో వాహనంలో రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రసూలాబాద్ శివారులో..

కొమురవెల్లి, ఏప్రిల్ 24 : మండలంలోని రసూలాబాద్ శివారులో మంగళవారం ఉదయం ఎస్సై నాగరాజు, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా, కిష్టంపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.60 వేలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసువెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు చూపాలని సూచించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని పందిల్లలో మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు బావిలో పడి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పందిల్లకు చెందిన యామ రాజ వ్వ ఈ నెల 21న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కుట